
ప్రజాశక్తి
శుక్రవారం 25 అక్టోబర్ 2024



ఎంఇఒ1 అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మండల విద్యాశాఖ అధికారులు-1 అసోసియేషన్ విజయనగరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామాల సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ వద్ద విజయనగరం జిల్లా ఎంఇఒ 1ల సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామభద్ర పురం ఎంఇఒ తిరుమల ప్రసాద్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎస్.కోట ఎంఇఒ బి.నరసింగ రావు వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులుగా గరివిడి ఎంఇఒ పి.రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గజపతి నగరం ఎంఇఒ ఎస్.విమలమ్మ, జిల్లా గౌరవ అధ్యక్షులుగా భోగాపురం ఎంఇఒ ఎం. రమణ మూర్తి, జిల్లా సలహాదారులుగా యుఎస్ఎన్ మూర్తి (నెల్లిమర్ల), ట్రెజరర్‌గా త్రినాథరావు (తెర్లాం), జిల్లా ఉపాధ్యక్షులుగా ఆర్ ప్రసాద రావు (ఆర్ ఆమదాలవలస) ఎస్. భాను ప్రకాష్ (గుర్ల), పి.ప్రవీణ్ కుమార్ (రాజాం) నియమితులయ్యారు. జిల్లా కార్యదర్శులుగా ఆర్.శ్రీదేవి (కొత్తవలస), జె.జయశ్రీ (జామి), జాయింట్ కార్యదర్శులుగా పి.లక్ష్మణదొర (బాడంగి), ఎం.వెంకటరావు (దత్తిరాజేరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మరణాలు

- మృతుల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తున్నారు
- గ్రామ స్వరాజ్యాన్ని నిర్వీర్యం చేశారు
- మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి
- గుర్లలో డయేరియా బాధితులకు పరామర్శ
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఆర్థికసాయం



స్పృహ తప్పిన మహిళకు నీరు తాగిస్తున్న మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/గుర్ల

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గుర్లతో పాటు పలు గ్రామాల్లో డయేరియా మరణాలు సంభవించాయని వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మృతుల సంఖ్యను ప్రభుత్వం తక్కువ చేసి చూపిస్తోందన్నారు. గుర్లలో డయేరియా బాధిత కుటుంబాలను, మృతుల కుటుంబాలను గురువారం పరామర్శించారు. బాధితులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు వైసిపి అండగా ఉంటుందని, ఒక్కో కుటుంబానికి రూ.2లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో సచివాలయాలు ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యం తీసుకొస్తే, వాటిని టిడిపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. గుర్ల మండలంలో డయేరియా ప్రబలి 14 మంది చనిపోతే దాన్ని కూడా రాజకీయం చేస్తోందన్నారు. వైసిపి హయాంలో ప్రతి గ్రామంలో సచివాలయాలు కనిపించేవని, అక్కడే వివిధ శాఖల వారు పని చేస్తూ కనిపించేవారని, కానీ నేడు ఆపరిస్థితి లేదని అన్నారు. గుర్ల మండలం పెనుబర్తిలో సెప్టెంబరు 20న ఒక వ్యక్తి చనిపోయి తొలి డయేరియా కేసు నమోదైంద న్నారు. అయినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. అక్టోబరు 12 వచ్చేసరికి డయేరియా మరింత విజృంభించిందని, గుర్ల, కోట గండ్రేడు, గోషాడ, నాగళ్లవలస, పున్నపురెడ్డిపేట తదితర గ్రామాల్లో డయేరియా ఉధృతమైందన్నారు. అక్టోబరు 19న తాను ట్వీట్ చేస్తే తప్ప, ప్రభుత్వం నుంచి స్పందన లేదని, ఆ తర్వాతైనా ప్రభుత్వం కదిలిందా? అంటే అదీ లేదని అన్నారు. జిల్లా కలెక్టర్ కేవలం ఒకరే చనిపోయాడని తక్కువ చేసి చూపే ప్రయత్నం చేశారని, మంత్రులు, అధికారులు ఎవరూ డయేరియాతో చనిపోలేదని చెప్పే కార్యక్రమం చేశారని అన్నారు. అక్టోబరు 24 వచ్చేసరికి చూస్తే, 14 మంది చనిపోయారని తేలిందన్నారు. రోగులకు కనీసం జిల్లా కేంద్రాస్పత్రికి గాని, పక్కనే ఉన్న చీపురుపల్లి ఆస్పత్రికి గాని తరలించే ప్రయత్నం చేయలేదన్నారు. అంబులెన్సులు ఏర్పాటు చేసి, డయేరియా బారిన పడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఎందుకు తీసుకుపోలేదని ప్రశ్నించారు. అందువల్లే గుర్లలో 9 మంది, మండలం మొత్తం 14 మంది మృతి చెందారని, ఇది ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. సమస్య పెద్దది కావడంతో సిఎం చంద్రబాబు తప్పు ఒప్పుకోక తప్పలేదన్నారు. డయేరియాతో 8 మంది చనిపోయారని చెప్పారని, ఇక్కడికి వచ్చిన డిప్యూటీ సీఎం 10 మంది చనిపోయారని చెప్పారని అన్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత ప్రజలకు కనీసం క్షమాపణ చెప్పి, జరిగిన తప్పును సరిదిద్దలేదన్నారు. చంపావతి నదిలో ఉన్న సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం చంద్రబాబు వచ్చిన తర్వాత, ఈ 5 నెలల్లో కనీసం మెయింటెనన్స్ రెన్యూవల్ కూడా చేయలేదని అన్నారు. దాని ఫిల్టర్లు మార్చారా? లేదా? కనీసం క్లోరినేషన్ జరిగిందా? అన్న కనీసం ఆలోచన కూడా చేయలేదని అన్నారు. సచివాలయ సిబ్బంది సహాయ, సహకారంతో గ్రామంలో శానిటేషన్ చేయాలన్న ఆలోచన కూడా చేయలేదని దుయ్యబట్టారు. గుర్ల మండలానికి సంబంధించి 345 మంది డయేరియాతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరగా, ప్రైవేటు ఆస్పత్రుల్లో అంత కంటే ఎక్కువగా దాదాపు 450 మంది చికిత్స పొందారని తెలిపారు. ఇప్పటికీ విజయనగరం జిల్లాలో గరివిడి, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల్లో డయేరియా కేసులు నమోదవుతున్నాయన్నారు. ఇంకా 62 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు.

ఏదైనా సంఘటన జరిగితే దాన్ని ఎలా డైవర్ట్ చేయాలి? ఎలా కవరప్ చేయాలి? అది అసలు జరగనట్లు ఎలా చూపించాలి? అన్న దిక్కుమాలిన ఆలోచన ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. గ్రామాల్లో పరిస్థితిని మెరుగుపర్చకపోగా, పిహెచ్‌సిలు, విలేజి క్లినిక్‌లు, సిహెచ్‌సిల్లో స్పెషలిస్టు డాక్టర్లను తీసేశారని, వైద్య శాఖలో జీరో వేకెన్సీ పాలసీని తాము తీసుకొస్తే, దాన్ని రద్దు చేశారని అన్నారు. ఆరోగ్యశ్రీని నీరు గార్చారని తెలిపారు. ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ ఆపి, వాస్తవాలను ప్రజలతో పంచుకుని, వారికి క్షమాపణలు చెప్పి, వారికి సహాయం చేసేందుకు అడుగులు వేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీమంత్రులు సీదిరి అప్పలరాజు, పి.పుష్పశ్రీవాణి, ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు, మాజీ ఎంపిలు విజయసాయిరెడ్డి, బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు కోలగట్ల వీరభద్రస్వామి, బొత్స అప్పలనర్సయ్య, ధర్మాన కృష్ణదాస్, గొర్లె కిరణ్, మాజీస్పీకర్ తమ్మినేని సీతారాం, రెడ్డి శాంతి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారిని ఆప్యాయంగా ముద్దాడుతున్న జగన్



సమావేశంలో అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి అనిత

డయేరియాతో ఏ ఒక్కరూ మరణించకూడదు

- జిల్లా అంతటా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్
- అభివృద్ధికి సమిష్టిగా పనిచేయాలి
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఇకపై డయేరియాతో ఏ ఒక్కరూ మరణించ కూడదని, అటువంటి మరణాలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని రాష్ట్ర హోంశాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత అధికారులను హెచ్చరించారు. ప్రతి శాఖకు ఒక నిర్దిష్ట కార్యాచరణ ఉంటుందని, దాని ప్రకారంగా ఆయా శాఖలు పని చేయాలని చెప్పారు. గుర్ల గ్రామంలో డయేరియా విజృంభించి పలువురు మృతి చెందిన నేపథ్యంలో మంత్రి అనిత గురువారం ఆ గ్రామంలో పర్యటించారు. చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆమె బాధితులను పరామర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఎంపిలు, ఎమ్మెల్యేలు, పలుశాఖల అధికారులతో సమీక్ష చేశారు. వచ్చే 10 రోజులు అన్ని వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచడం, క్లోరినేషన్ చేయాలని, జిల్లా అంతటా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. ప్రజల నుండి వచ్చే వినతుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని, ప్రతి అర్జీకి రాత పూర్వక సమాధానం ఇవ్వాలని తెలిపారు. అన్ని జలాశయాలలో నీటి నిల్వలు, గట్లు తదితర అంశాల పై ఒక నివేదిక నివ్వాలని జలవనరులశాఖ అధికారులకు సూచించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు కూడా క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని, దానివల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని తెలిపారు. కలెక్టర్ బిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ జిల్లా అంతటా సానిటేషన్ డ్రైవ్‌ను 10 రోజులపాటు చేపడుతున్నామని తెలిపారు. విశాఖ ఎంపి భరత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 29 శాఖలకు చెందిన 66 పథకాలను దిశా పేరుతో సమీక్ష చేస్తామని తెలిపారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ అధికారులు టీం వర్క్ చేయాలని సూచించారు. ఎమ్మెల్యే కళా వెంకట రావు మాట్లాడుతూ 30 వేల ఎకరాలకు నీరందించే తారకరామా తీర్థసాగర్‌కు 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేస్తే, పనులు ఇప్పటికీ పూర్తికాలేదని, దీనిపై మంత్రి దృష్టి పెట్టాలని కోరారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ పబ్లిక్ టాయిలెట్లను మరమ్మతులు చేయిస్తే నీటి కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తాము డైవర్షన్ రాజకీయాలు చేయడం లేదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను జగన్ తన సొంత అవసరాలకు ఖర్చు చేశారని ఆరోపించారు. గ్రామాలను అభివృద్ధి చేయలేదన్నారు. అందువల్లే వైసిపి సర్పంచ్‌లే ప్రభుత్వంపై కోర్టుకు వెళ్లారని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కోళ్ళ లలిత కుమారి, లోకం నాగ మాధవి, కోండ్రు మురళి, రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, ఎస్.పి వకుల్ జిందాల్, జెసి సేతు మాధవన్ పాల్గొన్నారు.

డయేరియా బాధితులకు మంత్రి పరామర్శ

గుర్ల : గుర్ల గ్రామంలో డయేరియా బాధితులను, మృతుల కుటుంబాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఇన్‌ఛార్జి మంత్రి అనిత పరామర్శించారు. వైద్య చికిత్సపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో కాలువలను, తాగునీటి పైప్ లైన్లను, పారిశుధ్యాన్ని పరిశీలించారు. భూగర్భ జలాల కలుషితం గురించి ఆరాతీశారు. గ్రామస్తులతో మాట్లాడారు. ఇళ్లలోకి వెళ్లి అధికారులు సీజ్ చేసి బోర్లను పరిశీలించారు. రామమందిరం వెనుకవీధిలో మురుగు నీరు వెళ్లేందుకు డ్రైనేజి లేకపోవడంతో ఆ వీధిలో ఉన్న వారంతా సొంతంగా పైపులైన్ ఏర్పాటు చేసుకున్నామని మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే మంత్రి ఆ వీధిని పరిశీలించి డ్రైనేజి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, నాయకులు వెన్నె సన్యాసి నాయుడు, తిరుమలరాజు కిరణ్ కుమార్, చనమల మహేశ్వర రావు పాల్గొన్నారు.

అశోక్ గజపతిరాజును కలిసిన హోం మంత్రి

అశోక్‌బంగ్లాలో సీనియర్ నేత అశోక్ గజపతిరాజును ఇన్‌ఛార్జి మంత్రి అనిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా ఎమ్మెల్యేలు సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నాయకులు రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు, ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్



పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న డిఐజి గోపీనాథ్

ప్రజాశక్తి-బొబ్బిలి

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి సూచించారు. బొబ్బిలి పట్టణ పోలీసుస్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని, చైతన్యంతో వాటి నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు, ఆధార్ వివరాలు, ఒటిపిలు అడిగితే పోలీసులను సంప్రదించాలని కోరారు. సైబర్ నేరాల్లో సొమ్ము పోగొట్టుకుంటే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేస్తే, రికవరీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైనా, ఆపదలో ఉన్నా టోల్ ఫ్రీ నెంబర్ 112కు ఫిర్యాదు చేస్తే సహాయం అందిస్తామని చెప్పారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలను విక్రయించినా, వాడినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణకు పని చేయాలని పోలీసులను కోరారు. అనంతరం పోలీసు స్టేషన్‌ను, రికార్డులను తనిఖీ చేసి పోలీసులకు పలు సూచనలు చేశారు.



ధర్నా చేస్తున్న ఎండిఎం కార్మికులు

బకాయి బిల్లులు చెల్లించాలని

ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-లక్కవరపుకోట

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బకాయి బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించాలని, కొత్త మెనూ అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన గురువారం ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ 21ఏళ్లగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు ప్రభుత్వం నెలలు తరబడి బిల్లులు, గౌరవ వేతనం చెల్లించకపోయినా అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.3వేల గౌరవ వేతనం ప్రభుత్వం నిర్దేశించిన రోజువారీ కూలి కంటే తక్కువని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త మెనూను ప్రకటించిందని, వాటి ధరలకు అనుగుణంగా కొత్త మెనూ ఛార్జీలు ఒక్కో విద్యార్థికి రూ.20 చొప్పున ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతం రూ.10వేలకు పెంచాలని, బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు, టి.వెంకటరమణ, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

తుపానుతో పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి-విజనయగరంకోట

బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుపాను కారణంగా ఈనెల 24 ,25 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో విజయనగరం రైల్వే స్టేషన్ మీదగా వెళ్లే 56 రైళ్లు రద్దయినట్లు స్టేషన్ మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. గురువారం 30, శుక్రవారం 26 రైళ్లతో పాటు మరికొన్ని రైళ్లు రద్దయ్యాయని తెలిపారు. వీటిలో ప్రతిరోజు తిరిగే విశాఖ ఎక్స్‌ప్రెస్, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, ఈస్టుకోస్టు, హౌరా- యశ్వంత్‌పూర్ తదితర రైళ్లు రద్దయ్యాయని తెలిపారు. వీటికి సంబంధించి విజయనగరం రైల్వే స్టేషన్లో ప్రత్యేక సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

పేద విద్యార్థులపై ఫీజుల భారం

- విడుదల కాని వసతి, విద్యా దీవెన డబ్బులు
- ఫీజుల కోసం విద్యార్థులపై ప్రైవేటు కళాశాలల ఒత్తిడి
- పరీక్షలు రాయనీయబోమని బెదిరింపులు
- నేడు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన చలో కలెక్టరేట్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి వచ్చినా పేద విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. గతంలో పూర్తి స్థాయిలో విద్యా దీవెన, వసతి దీవెన డబ్బులు వైసిపి ప్రభుత్వం విడుదల చెయ్యలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం నాలుగు నెలలైనప్పటికీ విద్యా పథకాల ఊసెత్తడం లేదు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుపై నేటికీ స్పష్టత ఇవ్వకపోవడంతో ఉన్నత విద్య అభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ముఖ్యంగా ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయి. కళాశాలల నిర్వహణ భారంగా మారిందనే కారణంతో ఫీజులు కట్టకపోతే పరీక్షలు రాయనీయబోమని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు తెగేసి చెబుతున్నాయి. దీంతో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో వివిధ కళాశాలల్లో 30వేల మందికి పైగా విద్యార్థులు వసతి గృహాల్లో ఉంటూ వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అయినా విద్యార్థుల ఫీజులు చెల్లిస్తుంని విద్యార్థులంతా ఎదురు చూశారు. అయినా ప్రభుత్వం నుంచి నేటికీ స్పందన లేదు. వచ్చే నవంబరు, డిసెంబరు నెలల్లో సెమిస్టర్ ఎగ్జామ్స్ ఉండటం వల్ల పరీక్ష ఫీజును ఆయా యాజమాన్యాలు విద్యార్థుల నుంచి కట్టించుకునేందుకు నిరాకరిస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టతా లేకపోవడంతో పరీక్ష ఫీజు కట్టించుకోవాలంటే ట్యూషన్ ఫీజు కచ్చితంగా చెల్లించాల్సిందే అంటూ ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు అప్పులుచేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. వీటికి తోడు వసతి దీవెన డబ్బులు కూడా ప్రభుత్వం నేటి వరకు విడుదల చేయలేదు. ఈనేపథ్యంలో జిల్లా కేంద్రంలో గత కొద్ది రోజులు క్రితం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అయినా ప్రభుత్వం నుంచి నేటి వరకు స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం తలపెట్టారు. ఫీజులు చెల్లిస్తారా చదువులు మానేయాలా అంటూ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫీజులు రావాల్సిన విద్యార్థుల సంఖ్య

2019-20లో కాపు 1130మంది, బిసి 39030 మంది, ఇబిసి 2291 మందికి, 2020-21లో కాపు1002, బి సి 40423, ఇబిసి 2848 మందికి , 2021-22లో కాపు1045, బిసి 41028, ఇబిసి 2925 మందికి, 2022-23లో కాపు986, బిసి 37860 మందికి , 2023-24లో కాపు, బిసి 32619, ఇబిసి 2224 మందికి ఫీజురీయింబర్స్ మెంట్ రావల్సి ఉంది. వీరితో పాటు ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు సుమారు 20వేల మందికి చెల్లించాల్సి ఉంది.

వెంటనే ఫీజులు చెల్లించాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలి. మొదటి విడత ఫీజును ఇప్పటివరకు చెల్లిం చకపోవడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. డిగ్రీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులపై ఆశలు పెట్టుకున్న వారంతా ఇప్పుడు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు నెలలు దాటినప్పటికీ ఈ పథకంపై కనీసం ఎటువంటి ప్రకటనా చేయడం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. లేని యెడల ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర తరం చేస్తాం. నేడు చలో కలెక్టరేట్‌కు విద్యార్థులు తరలి రావాలి.

- రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

డిఆర్‌ఒగా శ్రీనివాస్‌మూర్తి

అనితకు బదిలీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డి అనిత బదిలీ అయ్యారు. కొత్త డిఆర్‌ఒగా డిప్యూటీ కలెక్టర్ ఎస్.శ్రీనివాస్‌మూర్తి నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అందులో భాగంగా అనిత బదిలీ చేస్తూ జిఎడిలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. వెయిటింగ్‌లో ఉన్న శ్రీనివాస్‌మూర్తిని ఇక్కడి బదిలీ చేశారు.

డిఇఒగా మాణిక్యంనాయుడు

ప్రేమ్‌కుమార్ విశాఖకు బదిలీ



డిఇఒ మాణిక్యం

విజయనగరం టౌన్ : విజయనగరం డిఇఒగా యు.మాణిక్యం నాయుడు నియమితులయ్యారు. ప్రస్తుతం డిఇఒగా ఉన్న ఎన్.ప్రేమ్‌కుమార్‌కు విశాఖ పట్నం డిఇఒగా బదిలీ అయింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నంలో డైట్ సీనియర్ లెక్చరర్‌గా యు.మాణిక్యం నాయుడు పనిచేస్తున్నారు.


నేడు డయల్ యువర్ ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ఆర్టీసి డిపో పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం శుక్రవారం వారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విజయనగరం డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిపో పరిధిలో గల ప్రయాణికులందరూ ఎటువంటి సమస్యలున్నా ఫోన్ నెంబరు 9959225620 ద్వారా తెలిపి నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు.



చీపురుపల్లి పట్టణంలో సంచరిస్తున్న కుక్కల గుంపు



గాయపడిన వారిని పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

పిచ్చికుక్కల స్వైరవిహారం

చీపురుపల్లిలో 60 మందిపై దాడి

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి మేజర్ పంచాయతీలో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేశాయి. సుమారు 60 మంది కుక్కకాటుకు గురయ్యారు. పంచాయతీ పరిధిలోని ప్రజలు భయాందోళనకు లోనయ్యారు. గురువారం మధ్యాహ్నం చీపురుపల్లిలో పిచ్చికుక్కలు పలువురిపై దాడిచేశాయి. కనిపించిన వారందరిపైనా ఒక్కసారిగా దాడిచేస్తూ భయభ్రాంతులకు గురిచేశాయి. పిచ్చికుక్కల నుంచి తప్పించుకునేందుకు కస్పావీధి, లావేరురోడ్డు ప్రాంతాల్లో జనం పరుగులు తీయడం కనిపించింది. క్షతగాత్రులు స్థానిక ఏరియా ఆసుపత్రికి పరుగులు తీశారు. కుక్కల దాడితో ప్రజలు భయాందోళన చెందారు. వెంటనే కుక్కలను పట్టుకోవాలని అధికారులను కోరుతున్నారు. పిచ్చికుక్కల దాడి విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకొన్నారు. క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందించాలని వైద్యులను కోరారు. పిచ్చికుక్కలను పట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను కోరారు. క్షతగాత్రులను పరామర్శించిన వారిలో వైసిపి నాయకులు కోరుకొండ దాలయ్య, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్, ప్రభాత్ కుమార్, పి.గణేష్, నాగచైతన్య, దన్నాన సత్యం తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు కోసం 6 లోగా దరఖాస్తు చేయాలి

విజయనగరంకోట : శాసనమండలి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానానికి జరగబోయే ఎన్నికల్లో ఓటుహక్కు పొందేందుకు నవంబర్ 6 వ తేదీలోగా దరఖాస్తు చేయాలని ఇఆర్‌ఒ, విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహనరావు తెలిపారు. దీనికోసం అన్ని జిల్లాల్లో విస్తృత స్థాయిలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ ను ఈ సందర్భంగా ఆయన వివరించారు. నవంబర్ 23 న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటిస్తామని, అభ్యంతరాల స్వీకరణ అనంతరం డిసెంబర్ 30న ఓటర్ల తుది జాబితాను వెల్లడిస్తామని తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యాశాఖల అధికారులు పాల్గొన్నారు.

హోంమంత్రికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి

విజయనగరం టౌన్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హోంశాఖ మంత్రి వి.అనితకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అసోసియేషన్ జిల్లా శాఖ గురువారం వినతి అందజేశారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశానికి హాజరైన మంత్రికి అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు గండిపిల్లి మహేంద్ర బాబు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో అతి తక్కువ వేతనాలకు పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలని, పనిభారం తగ్గించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పలికల శ్రీను, సుభాషిని, రమణమ్మ, జనార్ధన్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-బొబ్బిలి

బాలికపై యువకుడు అత్యాచారం చేయడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ కథనం ప్రకారం.. మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలోని చెందిన బాలిక పార్వతీపురంలోని ఏకలవ్య పాఠశాలలో చదువుతుంది. ఫీజు డబ్బుల కోసం బాలిక మేనమామ శ్రీరామ్‌కు ఫోన్ చేసింది. ఆయన అందుబాటులో లేకపోవడంతో బొబ్బిలిలో ఉంటున్న గుమ్మలక్ష్మీపురం మండలం జర్న గ్రామానికి చెందిన కె.మోహన్‌కు చెప్పి, డబ్బులు కోసం బాలికను ఈ నెల 21న పంపించారు. బొబ్బిలిలో మోహన్‌ను ఆ బాలిక కలవగా, రూమ్‌లో డబ్బులు ఉన్నాయని చెప్పి తీసుకెళ్లాడు. చీకటి పడడంతో తన గదిలో రాత్రికి ఉండి ఉదయం వెళ్లాలని బాలికకు నమ్మబలికాడు. రాత్రి ఆ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ విషయం మేనమామ శ్రీరామ్‌కు బాలిక చెప్పడంతో ఆయన డయల్ 100కు ఫిర్యాదుచేశారు. దీంతో పార్వతీపురం పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసి, ఈ సంఘటన బొబ్బిలిలో జరగడంతో ఇక్కడ స్టేషన్ కు కేసు బదిలీ చేశారు. అత్యాచారం కేసుపై దర్యాప్తు చేసి నిందితుడు మోహన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సిఐ సతీష్ కుమార్ చెప్పారు. నిందితుడు బొబ్బిలిలో భవన నిర్మాణ పనులు చేసుకుని, పోటీపరీక్షలకు శిక్షణ తీసుకుంటున్నట్లు తెలిపారు.

స్వీపర్‌ను కొనసాగించాలి

ప్రజాశక్తి-రేగిడి

రేగిడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్వీపర్‌గా గొడే రాములమ్మను కూడా కొనసాగించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావు డిమాండ్‌చేశారు. 2017 నుంచి పనిచేస్తున్న దళిత మహిళ రాములమ్మను తప్పించి, 2021లో చేరిన ముంజేటి పార్వతిని కొనసాగిస్తూ స్కూల్ కమిటీ చేసిన తీర్మానాన్ని ఆయన వ్యతిరేకించారు. ఈ మేరకు గురువారం ఉంగరాడ మెట్ట వద్ద స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాజకీయ విభేదాలకు కార్మికులను బలి చేయొద్దని కోరారు. 300 మంది విద్యార్థులున్న హైస్కూల్లో ఒక్క స్వీపర్‌తో పాఠశాల పరిశుభ్రత, మరుగుదొడ్ల క్లీనింగ్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇద్దరినీ కొనసాగించాలని డిమాండ్ చేశారు. నిరుపేద దళిత ఒంటరి మహిళను తప్పించి ఆమె జీవనాధారాన్ని దెబ్బతీయొద్దని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మానవతా దృక్పథంతో స్పందించకపోతే ఈ నెల 28న ఎంఆర్‌సి వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, టిడిపి నాయకులు కొండ్రు జగదీష్‌కు రాములమ్మను ఆదుకోవాలని వినతి పత్రం అందించారు. జిల్లా కలెక్టరేట్, విద్యాశాఖ అధికారులను కలిసి ఈ సమస్యపై చర్చిస్తామని వారన్నారు. ఆయనతోపాటు సిఐటియు మండల కన్వీనర్ మండపాన త్రినాథ్, బాధిత మహిళ గొడే రాములమ్మ, స్థానిక నాయకులు త్యాగాల ఆదినారాయణ ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై 29న ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 29న నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) కార్పొరేషన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బి భాస్కరరావు, ఎ. జగన్మోహన్‌రావు తెలిపారు. ఈమేరకు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కొండపల్లి సాంబ మూర్తికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 62 సంవత్సరాల వరకు కార్మికులను కొనసాగించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మరణించిన, రిటైర్ అయిన వారి బిడ్డలకు ఉద్యోగాలు, మట్టి ఖర్చులు , ఎక్స్‌గ్రేషియో చెల్లింపు, హెల్త్ అలవెన్స్ బకాయిలు, పనిముట్లు, రక్షణ పరికరాలు, పర్మినెంట్ ఉద్యోగుల సరెండర్ లీవ్, డిఎ బకాయిలు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈనేపథ్యంలో తలపెట్టిన ధర్నాను కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. వినతనిచ్చిన వారిలో ఎస్.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సన్యాసినాయుడు

సర్పంచ్ ఆధ్వర్యంలోనే ఉపాధి పనులు

ప్రజాశక్తి- మెంటాడ

ఉపాధి హామీలో చేస్తున్న పనులు సర్పంచ్ ఆధ్వర్యంలోనే చేపట్టాలని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సర్పంచులు ఇచ్చిన తీర్మానాల ప్రకారం ఆరు కోట్ల రూపాయలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. వీటిని అభివృద్ధి పనులకు సద్వినియోగం చేయాలని, పనుల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులు నివేదికలు చదివి వినిపించారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్య లేకుండా తగు జాగ్రత్త వహించాలని అధికారులకు ప్రజాప్రతినిధులు సూచించారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలకు బదులుగా వారి భర్తలు పాల్గొనడం గమనార్హం. సమావేశంలో ఎంపిడిఒ భానుమూర్తి, తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, డిప్యూటీ డిఇఒ వెంకట్రావు, ఎపిఒ చిన్నప్పయ్య, హౌసింగ్ జెఇ ప్రసన్నకుమార్, ఇఒపిఆర్‌డి విమలకుమారి, పిఆర్ జెఇ గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత ప్రపంచమే రోటరీ లక్ష్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

పోలియో రహిత ప్రపంచమే లక్ష్యంగా రోటరీ సంస్థ సుదీర్ఘ కాలంగా నిర్విరామంగా కృషి చేస్తోందని రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్ జెసి రాజు అన్నారు. గురువారం బొబ్బిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పోలియో నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని, ర్యాలీని క్లబ్ పోలియో చైర్మన్ వి.శ్రీహరి, అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్ ఆధ్వర్యాన నిర్వహించారు. ముందుగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పిపి విభాగం డాక్టర్ సంతోషి, వైద్యాధికారి శశిభూషణరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సిహెచ్‌సి నుంచి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ ఏటా క్రమం తప్పకుండా పిల్లల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా ఇప్పించాలన్నారు. పోలియో నిర్మూలనకు రోటరీకి ప్రజలు నిధులు అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్‌సి వైద్యులు, రోటరీ ప్రతినిధులు గెంబలి శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, వెంకటేశ్వర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఆశావర్కర్లు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'బెర్రీ' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

భూగర్భ జలాలను బెర్రీ పరిశ్రమ తోడేయడంతో గ్రామస్తుల కనీస అవసరాలకు కూడా బోరు ద్వారా నీరు రావడం లేదని, వెంటనే ఆ పరిశ్రమ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం ఎం.బూర్జవలస శాఖా మహాసభలో తీర్మానించారు. గురువారం మండలంలోని ఎం.బూర్జవలసలో సిపిఎం శాఖా మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా కార్యదర్శి గేదెల అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామానికి సమీపంలో ఉన్న బెర్రీ పరిశ్రమ అనుమతులు లేకుండా 10 హెచ్‌పి మోటారుతో 24 గంటలూ భూగర్భ జలాలను తోడేయడంతో గ్రామస్తులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇష్టానుసారంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నా కాలుష్య నియంత్రణ బోర్డు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కార్యదర్శి ఎస్.గోపాల్, కోలా శంకరరావు, చుక్క రమణమ్మ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం రాజీవ్ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ అండర్-14 బాలబాలికల జిల్లా స్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. బాలురు నుంచి 12 మందిని, బాలికల నుండి 12 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి భగవాన్ దాస్, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి కృష్ణంరాజు , వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా నుండి రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్ళే జిల్లా జట్లకు యూనిఫామ్, ప్రయాణ ఛార్జీలు ఎస్‌జిఎఫ్ ద్వారా అందిస్తామని కార్యదర్శి తెలిపారు.

గుర్ల గుణపాఠం చాలదా..?

గోస్తనీ నదిలోనే చెత్తా చెదారం ● జామి మేజర్ పంచాయతీ నిర్వాకం


గోస్తనీ నదిలో చెత్త డంప్

ప్రజాశక్తి - జామి

కలుషిత నీటి వల్లే గుర్లలో డయేరియా వ్యాపించినట్లు నిపుణుల కమిటీ నిర్ధారించింది. చంపావతి నదీ గర్భంలో నీరు కలుషితం కావడం వల్ల పరివాహక ప్రాంతంలో డయేరియా కేసులు ప్రబలినట్లు తాజాగా వెల్లడించింది. కానీ జామి మేజరు పంచాయతీ అధికారులకు మాత్రం ప్రజారోగ్యం పట్టడం లేదు. గ్రామం మీదుగా ప్రవహిస్తున్న గోస్తనీ నదిలో యథేచ్ఛగా వ్యర్థాలు డంపింగ్ చేస్తున్నారు. గతంలో ప్రజాశక్తి 'గోస్తనీకి గర్భశోకం' అనే శీర్షికతో నదీ గర్భాన్ని పంచాయతీ వ్యర్థాలను నింపేస్తున్న తీరును ప్రచురించింది. అప్పట్లో జిల్లా కలెక్టర్ స్పందించి, పంచాయతీ అధికారులకు మెమోలు కూడా జారీ చేశారు. అయినా జామి పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. తాజాగా గుర్లలో డయేరియా విజృంభణతో రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు గుణపాఠంగా తీసుకున్నా జామి మేజరు పంచాయతీ అధికారులకు పట్టడం లేదు. జామి మండలంలో దాదాపుగా 10 గ్రామాలకు పైగా నదీ తీరానే ఉన్నాయి. అన్నిగ్రామాలకు నదిలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాల నుంచే తాగునీరు సరఫరా అవుతోంది. చంపావతి నదిలో దహన సంస్కారాలు, జాతరలు, డంపింగ్ యార్డులు నిర్వహించడం వల్లే ప్రమాదం వాటిల్లినట్లు నిర్ధారించిన తరుణంలో గోస్తనీ నదిలో చెత్త వేయడం ఏమిటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గుర్లను గుణపాఠంగా తీసుకుని, నదీ పరివాహక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కానీ జామి మేజరు పంచాయతీ వ్యవహారంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుంటే తప్ప మరో ప్రమాదాన్ని అరికట్టలేమని ప్రజలు అంటున్నారు.

తక్షణమే చర్యలు తీసుకుంటా

గోస్తనీ నదిలో చెత్త వేస్తున్న విషయంపై విచారించి, తక్షణమే చర్యలు తీసుకుంటాం. తాగునీటి పథకాలు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిదీ. దీనిపై వెంటనే పంచాయతీ అధికారులను ఆదేశిస్తాం.

- నీలం అప్పలనాయుడు, ఎంపిడిఒ

బీమాతో కార్యకర్తలకు భరోసా

మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-గజపతినగరం

టిడిపి సభ్యత్వ నమోదు ద్వారా బీమా సౌకర్యం కల్పించడంతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం బోడసింగిపేట సమీపంలో ఉన్న ప్రయివేటు కల్యాణ మండపంలో మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్ అధ్యక్షతన టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలను ఆపద కాలంలో బీమా ద్వారా ఆదుకోవాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. నియోజకవర్గంలో ఇంటింటికి మంచి నీరు ఇచ్చేందుకు రూ.300 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు వెల్లడించారు. రానున్న నీటి సంఘం, స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మంత్రి నోట విభేదాల మాట

నియోజకవర్గంలో ప్రధానంగా గజపతినగరం, దత్తిరాజేరు మండలాల్లో రెండు గ్రూపులు ఉన్నాయని, దీనివల్ల పార్టీకి నష్టం చేకూరుతుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ అన్నారు. గ్రూపులు కట్టడం మాని, అందరూ సమిష్టిగా పనిచేయాలని కోరారు. ఇదే సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పి.వి.వి గోపాలరాజు మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నవారికి జరుగుతున్న అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి కల్పిస్తున్న సముచిత స్థానం పాతవారికి కూడా కల్పించాలని కోరారు.

సమావేశంలో టిడిపి బొండపల్లి, గంట్యాడ, దత్తిరాజేరు, జామి మండలాల అధ్యక్షులు కోరాడ కృష్ణ, కొండపల్లి భాస్కర్ నాయుడు, చప్ప చంద్ర శేఖర్, పోలిపర్తి స్వామి నాయుడు, మాజీ ఎంపిపిలు కొండపల్లి కొండలరావు, గంట్యాడ శ్రీదేవి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు బాలాజీ, ఐటిడిపి జిల్లా కో-ఆర్డినేటర్ విమల, మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పోరాటంతో...

మద్యం షాపు తరలింపునకు హామీ

ప్రజాశక్తి-బొబ్బిలి


ఎక్సైజ్ సిఐకి వినతి అందిస్తున్న గెంబలి శ్రీనివాసరావు, స్థానికులు

బొబ్బిలి మార్కెట్లో ఏర్పాటు చేసిన మద్యం షాపును తరలించాలని మహిళలు, చిల్లర వర్తకులు వారం రోజులుగా పోరాటం చేయడంతో ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. మద్యం షాపును వేరే ప్రాంతానికి తరలించేందుకు చర్యలు చేపట్టింది. మార్కెట్లో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం షాపును వేరే ప్రాంతానికి తరలించాలని స్థానికులు ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. వారికి సిపిఎం, ఐద్వా మద్దతు ప్రకటించి, మద్యం షాపును తరలించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించాయి. ఆందోళనకు టిడిపి మున్సిపల్ నాయకులు కూడా మద్దతు ప్రకటించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే బేబినాయన మద్యం షాపును వేరే ప్రాంతానికి తరలించాలని ఎక్సైజ్ సిఐ చిన్నంనాయుడును ఆదేశించారు. దీంతో గురువారం ఆందోళన వద్దకు వెళ్లి ఈ నెల 31 తర్వాత మద్యం షాపును వేరే ప్రాంతానికి తరలిస్తామని హామీ ఇచ్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సజావుగా పరిహారం చెల్లింపు

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-కొత్తవలస


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు సజావుగా పరిహారం చెల్లింపుల ప్రక్రియ సాగాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం మండలంలోని ఉత్తరాపల్లి గ్రామంలో భూములకు సంబంధించి క్లెయిములు చెల్లించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేలో సుమారు 21 ఎకరాల భూమికి గాను 53 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయం జరిగేలా అధికారులు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.నీలకంఠరావు, ఎంఆర్ఐ రాజేష్, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల వెంకట రమణ, నాయకులు గొంప దుర్గా ఉమేష్, సింగంపల్లి ప్రకాశ్, లగుడు ఎర్రినాయుడు, ఇమంది లక్ష్మణరావు, సింగంపల్లి వాములు, షేక్ సయ్యద్, సర్పంచి ప్రతినిధి సింగంపల్లి గణేష్ పాల్గొన్నారు.

సహకారాన్ని సద్వినియోగం చేసుకోండి

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళల ఆర్థిక స్వావలంబనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అందిస్తున్న సహకారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య సూచించారు. గురువారం స్వయం సహాయక సంఘాల రిసోర్స్ పర్సన్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు. ఆయా పథకాల పట్ల అవగాహన పెంచుకొని పథకాలను పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. పిఎం విశ్వకర్మ యోజన, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాలు పట్ల మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. వీటికి ప్రభుత్వాలు రాయితీని కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. పిఎం స్వనిధి ద్వారా పథకాల మంజూరుకు ఈ నెలాఖరులోగా లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు. ఈ విషయంలో ఉదాశీనంగా వ్యవహరించినట్లయితే సంబంధిత కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సిటీ మిషన్ మేనేజర్లు, టిపిఆర్ఒలను బాధ్యులుగా చేస్తామని హెచ్చరించారు. నెలాఖరులోగా 1780 రుణాలు మంజూరయ్యే విధంగా చూడాలన్నారు. మిగిలిన 279 సాంకేతిక ఇతర సమస్యలతో ఉన్నాయని అన్నారు. సమావేశంలో టిపిఆర్ఒ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థం హుండీ ఆదాయం రూ.28లక్షలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.28.08 లక్షలు వచ్చింది. గురువారం దేవస్థానం ఆవరణలో పైడితల్లమ్మ ఆలయ ఇఒ డివివి ప్రసాదరావు పర్యవేక్షణలో హుండీలను తెరిచారు. ఈ ఏడాది మే నుంచి నేటివరకు 5 నెలలకు గాను రూ.28,08,291 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్, ఇఒ వై. శ్రీనివాసరావు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, రామతీర్థం ఎపిజివిబి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు సిబ్బంది అప్రమత్తం

ప్రజాశక్తి-బాడంగి

విద్యుత్తు సిబ్బంది సచివాలయాల్లో అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ రామకృష్ణ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జెఎల్‌ఎంలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావం జిల్లాపై ఉంటుందన్న సమాచారంతో అందరినీ సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. దెబ్బతిన్న స్తంభాలు, వదులుగా ఉన్న తీగలపై దృష్టిపెట్టాలని సూచించారు. ఎక్కడా విద్యుత్తు శాఖా పరంగా ప్రాణ నష్టం గానీ, ఆస్తినష్టం గానీ సంభవించకుండా అన్ని చర్యలు ముందస్తుగానే తీసుకోవాలని ఆదేశించారు.

బాధ్యతగా రేషన్ పంపిణీ

ప్రజాశక్తి-రేగిడి

డీలర్లు నిత్యావసర సరుకులను బాధ్యతగా పంపిణీ చేయాలని తహశీల్దార్ ఎల్లారావు, సిఎస్ డిటి రామారావు స్వామి సూచించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లు, వాహన డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడువులోగా రేషన్ పంపిణీ చేయాలన్నారు. తూనికలు, కొలతలు సరిగా ఉండాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం నాయకులు రామ్మూర్తి నాయుడు, సత్యం నాయుడు ఉన్నారు.

భవిష్యత్తు ఓటర్లుగా నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-భోగాపురం

17 ఏళ్లు నిండిన వారు భవిష్యత్తు ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని తహశీల్దార్ ఎం.సురేష్ తెలిపారు. భోగాపురంలోని ఎస్‌కెఎడిఎం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిలో 17 ఏళ్లు నిండిన వారు కూడా దరఖాస్తు చేసుకుంటే 18 ఏళ్లు పూర్తయిన వెంటనే ఆటోమేటిక్‌గా ఓటు హక్కు లభిస్తుందని చెప్పారు. గ్రామాల్లోని బిఎల్‌ఒలకు, లేదా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

క్రీడల్లో సత్తాచాటిన హేమశ్రీ

ప్రజాశక్తి-వేపాడ


హేమశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాల ఇంటర్ విద్యార్థి సింగంపల్లి హేమశ్రీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో సత్తాచాటింది. విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన వాలీబాల్‌లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైంది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో హేమశ్రీని ప్రిన్సిపల్ ఆర్.ఈశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు రమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న కెజిబివి అదనపు గదుల నిర్మాణ పనులను గురువారం ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ పైడిరాజు పరిశీలించారు. వ్యయం పెరగడంతో నిర్మాణ పనులను కాంట్రాక్టరు మధ్యలో వదిలేశారు. ఇరుకు గదుల్లో విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులను సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ప్రజాదర్బార్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ అంబేద్కర్ స్పందించి, కెజిబివిని పరిశీలించి, నివేదిక అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కెజిబివిని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవితో కలిసి డిఇఇ పరిశీలించారు. అనంతరం బాలికలకు ఇస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో కెజిబివి ఎస్‌ఒ కిరణ్మయి పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ప్రజాశక్తి -తెర్లాం

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ రవికిరణ్ తెలిపారు. గురువారం మండలంలోని పెరుమాళి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు 50 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ కృష్ణమూర్తి, కార్యదర్శి బి.వెంకట్రావు, మండల సర్వేయర్ సాయి, సచివాలయ సర్వేయర్ శ్రవణ్, విఆర్‌ఒలు నాగరాజు, ఎస్.శ్రీనివాసరావు, సర్పంచ్ ప్రతినిధి అప్పలనర్సింహరాజు, వైస్ ఎంపిపి ప్రతినిధి అప్పలరాజు పాల్గొన్నారు.

బానాదిలో గ్రామసభ

వేపాడ : మండలంలోని బానాది గ్రామంలో గురువారం భూములు రీసర్వే గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ రాములమ్మ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ గ్రామసభకు 54 దరఖాస్తులు రావడం విశేషం. కార్యక్రమంలో ఎంపిటిసి గొంప తులసి, సర్పంచ్ కర్రి యశోద, ఆర్ఐ రామలక్ష్మి, విఆర్ఒ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవిజిఆర్‌లో తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి-డెంకాడ


తైక్వాండోలో తలపడుతున్న క్రీడాకారులు

మండలంలోని చింతల వలస వద్దనున్న ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో తైక్వాండో పోటీలను గురువారం నిర్వహించారు. జెఎన్‌టియు-జివి పరిధిలోని కళాశాలల నుంచి విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పరిధిలో పలువురు క్రీడాకారులను ఎంపిక చేశారు. రఘు ఇంజినీరింగ్ కాలేజీ ఫిజికల్ ఎడ్యుకేషనల్ అసోసియేట్ ప్రొఫెసర్ జిసిసిఎన్ రాజు, సి.వేణుగోపాల్‌రావు, విఎన్‌డి ప్రవీణ్, ఆర్.రమేష్, డి.రమాదేవి కమిటీ ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించింది. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రఘు, ఎన్.గోపీచంద్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బైరిపురం విద్యార్థులు

ప్రజాశక్తి-మెరకముడిదాం

రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలకు బైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.ఈశ్వరరావు తెలిపారు. విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో జరిగిన ఆటల పోటీల్లో త్రోబాల్‌లో అండర్ -17 విభాగంలో రెడ్డి అనూష, అండర్ -14 విభాగంలో తోట ఢిల్లీశ్వరి, అండర్ -17 క్రికెట్‌లో తాండ్రాసి శివ సత్తాచాటారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు జె.నానాజీ హెచ్‌ఎం అభినందించారు.

అసిసెంట్ కమిషనర్ వార్డు సందర్శన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు గురువారం నగరంలోని 14 వ డివిజన్‌లో పర్యటించారు. పారిశుధ్యం, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టిలో పెట్టి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ఇతర సౌకర్యాలు పర్యవేక్షించామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చురుగ్గా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పారిశుధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగిస్తున్నారు. సింగరాయి ఎస్‌సి కాలనీ, ఆతవ గ్రామాల్లో ఆయా పంచాయతీ కార్యదర్శులు సత్యవతి, పద్మ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై జాగ్రత్తలను వివరించారు.

మెరకముడిదాం : మండలంలోని బిల్లలవలస, బైరిపురం, తదితర పంచాయతీల్లో పారిశుధ్య పనులు చురుగ్గా చేపడుతున్నారు. హ్యాండ్ బోర్లలో క్లోరినేషన్, రక్షిత మంచినీటి ట్యాంకుల్లో, వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. కాలువల్లో పూడికలు తొలగిస్తున్నారు.

28న వక్తృత్వ, వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

మహాకవి గురజాడ వర్ధంతి సందర్భంగా ఈనెల 28న గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలిపారు. జిల్లా స్థాయిలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం ఉదయం 9.30గంటలకు గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. .' గురజాడ కన్యాశుల్కం- నాటి సామాజిక పరిస్థితుల'పై .వక్తృత్వ పోటీలకు 6 వ తరగతి నుండి 10 వ తరగతి విద్యార్థులు అర్హులని, 4 నిముషాలు మాత్రమే మాట్లాడాలని తెలిపారు. గురజాడ దేశభక్తి అనే అంశంపై 6,7 తరగతుల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు ఉంటాయని తెలిపారు. 8,9,10 వ తరగతి విద్యార్థులు గురజాడ సాహిత్యంలో మహిళ అనే అంశంపై వ్యాసరచన పోటీ ఉంటుందని తెలిపారు. వీరికి గురజాడ విశిష్ట పురస్కార ప్రదానోత్స సభలో బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. వివరాలకు గురజాడ ఇందిర 8374449526, ఈపు విజయకుమార్ 9912764646, సూర్యలక్ష్మి 9440117116 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యాన వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని ఎనిమిది పాఠశాలల నుంచి 18 జట్లు పాల్గొన్నాయి. విక్టరీ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ, మోడల్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలను ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ వల్లి, నిర్వాహకులు పి.వరప్రసాద్, కర్రి రాము అభినందించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో శుక్రవారం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇఇ జి.సురేష్‌బాబు తెలిపారు. 11కెవి విద్యుత్తు ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామస్తులు సహకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుతో మహిళ మృతి

గజపతినగరం : పాము కాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని వేమలి గ్రామంలో జరిగిందని ఎస్.ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. గ్రామానికి చెందిన భార్యా భర్తలు పల్లె బంగారమ్మ, పైడిరాజు మంగళవారం తమ గొర్రెలను మేతకోసం దగ్గర్లో ఉన్న చెరువుకు తోలుకెళ్లారు అక్కడ బంగరమ్మకు పాము కరవటంతో వైద్యం నిమిత్తం గజపతినగరం సిహెచ్‌సికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడు పరిస్థితి విషమించి బంగారమ్మ మృతి చెందింది.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

రామభద్రపురం : మండలంలోని గిరిశిఖర ప్రాంతం రావివలస ఎంపిపి స్కూల్ ఉపాధ్యాయుడు పిసిని వెంకటప్పడు (57) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. బలిజిపేట మండలం చిలకలపల్లికి చెందిన వెంకటప్పుడు ఇక్కడ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం విధుల్లో ఉంటూ మలవిసర్జనకు బయటకు వెళ్లారు. అక్కడే తీవ్ర గుండె నొప్పితో కుప్పకూలి మృతి చెందారు. సహచర ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

రెండు బస్సులు దగ్ధం

విజయనగరం టౌన్ : నగరంలో పాత బస్టాండ్ వద్ద గురువారం తెల్లవారి రెండు బస్సులు దగ్ధమయ్యాయి. విజయలక్ష్మి ట్రావెల్స్‌కు చెందిన రెండు బస్సులు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ పక్కన బస్సులను నిలుపుదల చేయడంతో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. తనకూ ఎవరూ శత్రువులు లేరని, ఎలా జరిగిందో తెలియదని ట్రావెల్స్ యజమాని తాతారావు తెలిపారు.